# ఈలా - ఇల్లాలు

"త్రాయారూ" అని గట్టిగా అరిచాడు పాపారావు. జబ్బమీద వున్న పురుగుని దులి పేసుకుంటూ నిర్లక్ష్యంగా చూసింది తాయారు. "నిన్నింట్లో ఈలవేసుకుంటూ తిరగొద్దన్నానా?" అన్నాడు కోపంగా.

"అంటే వీధిలో తిరగమనా దానర్థం?" అంటూ వీధిలోకి పోబో యింది తాయారు. చెయ్యిపట్టుకొని ఆపుచేసి బాధగా- "తాయారూ! నన్నిలా ఎందుకు బాధ పెడుతున్నావో తెలియడంలేదు. నువ్వెందుకులే- నేనే వెడుతున్నాను" అని బయటికి నడిచాడు పాపారావు.

దారిలో పాపారావుకి ఖాన్ ఎదురయ్యాడు. "ఏరా, పాపారావ్, ఈరోజు సెషన్స్‌కి రావా? టూ ఫోర్లు ఆడదాము. రాఘవరావు కూడా వచ్చేడు" అని ఆహ్వానించాడు. పాపారావు విషాదంగా "సారీరా ఖాసూ, ఈరోజు నా మనస్సేం బాగాలేదు. నీవెళ్ళిరా" అన్నాడు.

ఖాన్ వెంటనే ఆముదం తాగినవాడిలా తన మొహాన్ని మార్చేసు కొని...."అరెరే పాపం నీ మనసు కేమయిందిరా?" అన్నాడు. పాపా రావుకి ఒళ్ళు మండింది. కోపంగా "ఒరేయ్ వెధవ్వేషాలు వెయ్యకు. నీ వెంత తైరు కొట్టినా నీకు నయాపైసా అప్పివ్వను. అందులోనూ పేకా టకి" అన్నాడు. ఖాన్ "ఛా! ఎత్తు పారలేదు" అనుకొని వెళ్ళిపోయాడు.

పాపారావు తిన్నగా నడిచి పార్కులోకి వెళ్ళాడు. పొగడ చెట్టు కింద వున్న సిమెంటు బెంచీమీద కూర్చొని ఆలోచించడం మొదలు పెట్టాడు.

తాయారు ఎందుకిలా చేస్తూంది? అసలీ అలవాటు తాయారు కెలా వచ్చింది- అని తర్కించుకున్నాడు. ఇదేదో అంతుపట్టని సమస్యలా మిగిలిపోయింది. సరే....ఆలోచనల్లో పాపారావుని వదిలిపెట్టేసి అతని గత చరిత్రలోకి వెళదాం.

★ ★ ★ ★

పాపారావు అసలు పేరు పాపారావే. నాలుగయిదు సంవత్సరాలు కాపీకొట్టి చివరికి ఎలాగయితేనేం బి.ఏ. పాసయ్యాడు. ఉద్యోగాల కోసం చెడతిరిగి వ్యవసాయమే మంచిదని వాళ్ళ వూరు కొత్తపల్లి పోయాడు. తీరా కాడి పట్టుకొనేసరికి 'స్టేట్ బ్యాంక్' నుంచి ఇంటర్వ్యూ వచ్చేసరికి 'కాడి' వదిలేసి కాకినాడ పరుగెత్తుకొచ్చాడు. ఎలాగయితేనేం కాకినాడలో ఉద్యోగము సంపాదించగలిగాడు.

పాపారావు భూమికి ఓ అయిదు అడుగుల ఎత్తులో వుంటాడు. (అపార్థం చేసుకోకండి. పాపారావు దయ్యమయిపోయాడని నా ఉద్దేశ్యం కాదు) నల్లగా వున్నా కనుముక్కు తీరూ అదీ బాగుంటుంది. పోతే కొంచెం పిరికిగుండె.

బ్యాంక్‌లో ఉద్యోగం అనగానే పెళ్ళికూతుళ్ళ తండ్రులు ఎగబడ్డారు. చివరికి నాలుగెకరాలు, పదివేల రూపాయలతో అలివేలు మంగ తాయారుని పెళ్ళాడాడు.

తాయారు చిన్నతనంనుంచీ చాలా గారాబంగా పెరిగింది! ఒక్కతే కూతురు కావడంవల్ల 'ఆడింది ఆట, పాడింది పాట'గా సాగుతుండేది. అసలు తాయారుకి ఈల వేయడం అనే అలవాటు ఎలా వచ్చిందీ-అంటే అదో కథ.

చిన్నప్పుడు తాయారు వాళ్ళ స్కూల్లో అమ్మాయిలంతా డ్రామా వేద్దామనుకొన్నారు. ఆ డ్రామాలో తాయారు రౌడీ! ఒకచోట ఈల వేయాలి. ఎలాగయినా ఈలవేయడం నేర్చుకోవాలి అనుకొంది. వాళ్ళ మాస్టారు మాత్రం 'నీకెందుకమ్మా శ్రమ. నీవు ఈలవేసే సమయానికి తెర వెనుకనుండి వేయిస్తాను' అన్నాడు.

"ఎందుకండీ? ఎలాగయినా నేర్చుకొనే పూచీ నాది" అంటూ ఇంటికి వెళ్ళి వాళ్ళ అన్నయ్యను వేపుకుతింది. వాళ్ళ నాన్న రెండు వడ్డించినా ఏడవకుండా నిరాహారదీక్ష సాగించి పంతం నెగ్గించుకుంది. ఎలాగయితేనేం తాయారు ఇంట్లో రెండు రోజులపాటు ఈల ప్రాక్టీసు సాగింది. అలా నేర్చుకొన్న ఈ విద్య ఇలా లోతుగా పాతుకుపోయి పాపారావు మనసులో కలతలు రేపుతూంది. దానికితోడు చిన్నతనంనుంచీ గారాబంగా పెరిగిందేమో మొండి మనిషై కూర్చుంది.

ఉన్నట్టుండి అంతవరకూ నిశ్శబ్దంగా వున్నదల్లా చటుక్కున విజిల్ వేస్తుంది తాయారు. ఉలిక్కిపడి చూస్తాడు పాపారావు. ఎంతో బాధ వేస్తుంది. కోపం కూడా వస్తుంది. కానీ ఏం చేస్తాడు? పది వేలకి అమ్ముడు పోయాడు. ఏమైనా అంటే "మీరు రమ్మంటే రావడానికి, పొమ్మంటే పోవడానికి పెళ్ళాడాననుకున్నారా? పది వేలిచ్చి మరీ పెళ్ళి చేశాడు మా నాన్న" అని మొదలుపెడుతుంది. ఏమీ చేయలేని మగాళ్ళందరిలాగే పాపారావు కూడా భార్యకి 'వట్టి మూర్ఖపుమనిషి' అని బిరుదిచ్చుకుని ఇంకా వాదాలెందుకని సరిపెట్టుకున్నాడు.

అందరాడవాళ్ళూ ఏవో కీర్తనలో, లేకపోతే కనీసం సినిమా పాటలో పాడుకుంటూ పనిచేసుకుంటారు. కానీ, తాయారు మాత్రం వంటింట్లోనేమిటి, బయట వరండాలో కూడా అప్పుడప్పుడూ విజిల్ వేస్తూ చేతులు వెనక్కి కట్టుకొని పచార్లు చేస్తూ వుంటుంది. పాపారావుకి మతి పోతూ వుంటుంది,

అంతెందుకు? ఎవరన్నా స్నేహితుడు వచ్చినప్పుడు చూడాలి— పాపారావు అవస్థ. చచ్చిన చావు అవుతుంది. పాపారావు మాట్లాడుతున్న వాడల్లా లోపలినుంచి ఈలపాట ఏదయినా వినిపించగానే, తను మాట్లాడటం మానేసి ఈల వేయటం మొదలు పెడతాడు. అవతలివాడు తల మునకలయ్యేంతగా ఆశ్చర్యపోయి, "ఇప్పటివరకూ మాట్లాడాడుకదా! ఇంతలోనే ఏమొచ్చింది?" అనుకొని పాపారావువైపు భయంభయంగా చూస్తాడు. స్నేహితుడి అవస్థ గమనించి పాపారావు మొహం ఆముదం తాగినట్లు అయిపోయినా విజిల్ మాత్రం తాయారు లోపల ఆపుచేసేంతవరకు ఆపడు.

పోనీ తను గట్టిగా మాట్లాడి లోపలనుంచి విజిల్ వినిపించకుండా చెయ్య వచ్చుకదా అనే అనుమానం ఇక్కడ రాకూడదు. ఎందుకంటే రైలుకూత కూడా తాయారు విజిల్‌ని డామినేట్ చేయలేదు.

విజిల్ వేస్తున్నట్లు నటించటం అనేది పాపారావు ఒరిజనల్ ఐడియా కాదు. వాళ్ళ మామగారిది. ఆయన దాన్ని పాపారావుమీద ప్రయోగించి కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేశాడు.

పెళ్ళి చూపులకి వచ్చి కుర్చీలో కూర్చునివున్న కుర్రాడినిచూసి సరదాగా విజిల్ వేసేది తాయారు. (మనసులో ఇంకే ఉద్దేశ్యమూ లేదు స్మండీ) దానితో ఆ కుర్రాడూ, మిగతా పెద్దలూ బేజారెత్తి వెళ్ళిపోయే వారు. తాయారు నాన్నగారు నెత్తినోరూ కొట్టుకునేవారు. ఇలా రెండు మూడు సంబంధాలు తప్పిపోయాక తాయారు అన్నయ్యకి ఒక మంచి ఐడియా వచ్చింది. తాయారు నాన్న దగ్గరకు వెళ్ళి "నాన్నా, ఈసారి వచ్చే సంబంధం మనకి సెటిల్ అయిపోయినట్టే పెళ్ళివాళ్ళని చూసుకోవడానికి రమ్మను" అన్నాడు.

"ఎలారా?" అన్నాడు వాళ్ళ నాన్న. "నేను చెబుతాగా" అని భరోసా ఇచ్చేశాడు.

ముందు పాపారావు తాలూకు పెద్దలువచ్చిచూసుకున్నారు. అదృష్ట వశాత్తూ అప్పుడేమీ గొడవ చెయ్యలేదు మంగతాయారు. ఆ తరువాత కొద్ది రోజులకు పాపారావు కొంతమంది ఫ్రెండ్స్‌తో అంటే ఖాన్, రాఘవేంద్ర, సూర్యంలతో అమ్మాయిని చూసుకోవడానికి వచ్చాడు.

శుభ్రంగా కడుపునిండా టిఫిన్ తిన్న తరువాత బ్రేవ్ మని తేన్చి అమ్మాయికోసం ఎదురుచూడసాగాడు పాపారావు. అంతలో తాయారు వచ్చింది. పాపారావును చూడగానే సరదాగా విజిల్ వేసింది. అంతలోనే పక్కనున్న అన్నయ్యకూడ గట్టిగా విజిల్ వేశాడు. పాపారావు చతు ష్టయం ఈ విషయాన్ని గమనించలేకపోయారు. "తాయారు అన్నయ్య ఇంత మానర్లెస్‌గా విజల్స్ వేస్తాడేమిటా?" అని జాలిపడ్డారు కూడాను. అలా పాపారావు "విక్టిమ్" అయిపోయాడు. ఆ తరువాత బావగారికి ఈ

సలహా చెప్పి స్నేహితుల బారినుంచి తప్పుకొనేమార్గం బోధించాడు అన్నయ్య.

పాపారావుకి తన భార్య అలవాటు సంగతి ఎలా తెలిసిందంటే అదీ పెద్ద కథే.

మొదటిరోజు రాత్రి....

పందిరి మంచంమీద పాపారావు కాలుమీద కాలేసుకుని జిలేబితింటు న్నాడు. కొంచెం భోజనప్రియుడులెండి. అగరొత్తులూ, మల్లెపూల వాస నతో గది గుభాళిస్తూంది. పాపారావుకి బెదురుగానే వుంది.

అంతకు కొద్దిరోజుల క్రితమే రాజు దగ్గర శిష్యరికం పొందాడు పాపారావు. రాజు పూర్తి పేరు సత్యనారాయణరాజు!

"సలహాల్రాజు" అని అందరూ అంటూ వుంటారు కూడా. చిన్న సలహా అయితే కాఫీ, టిఫిన్. పెద్ద సలహా అయితే ఒక్క "హల్లో".... రాజు ఫీజు! రాజుకి ప్రతి విషయంలోనూ ప్రవేశముంది. (అని తను అను కుంటూ వుంటాడు.) "రెండు హల్లోలు" సమర్పించి రాజు దగ్గర తను మొదటిరోజు చెప్పవలసిన డైలాగులన్నీ పాఠంలా బట్టీపట్టి, ఎందుకైనా మంచిదని కాపీ రాసుకుని జేబులో పెట్టుకున్నాడు.

తాయారు లోపలికి వచ్చింది. బయటవున్న ఆడంగులతో "గడియ బయట పెట్టుకోండి. లోపల గడియ సరిగ్గా పడదు" అని చెప్పి తలుపు వేసింది. పాపారావుని చూసి నవ్వి చుట్టూ కిటికీలనీ, బొందుల్నీ పరీక్షించ సాగింది. పాపారావు మూర్ఛపోబోయి తమాయించుకున్నాడు. సలహా ల్రాజు చెప్పిన పాఠంలో ఇంకోలా వుంది. ఆ అమ్మాయి గడప దగ్గరే బొటన వేలితో పిచ్చిగీతలు గీస్తూ నిలబడి వుంటుందని సలహాల్రాజు చెప్పిన పాఠంలో మొదటి పేరానుంచీ కంటిన్యూ చేద్దామనుకున్నాడు పాపా రావు.

జూలియెట్‌లాగా తాయారు నిలబడి వుందనుకొని, ఆమె ముందు మోకాళ్ళమీద కూర్చుని రెండు చేతులూ పూర్తిగా చాపి "తాయారూ నా

జీవనరాగానికి సితారూ" అని, తరవాత డైలాగు మర్చిపోయి, లేచి నిల బడి సీరియస్‌గా జేబులో కాగితంకోసం వెతుక్కోసాగాడు. దిండు క్రింద పరుపు, దుప్పటి దులిపి అన్నీ గాలించాడు. లాభంలేకపోయింది. తాయారు అతణ్ణిచూసి జాలిపడి నవ్వింది ఇంక ఆ కాగితంతో లాభం లేదనుకొని పాపారావు ఆమెని దగ్గరకి తీసుకున్నాడు. తాయారు అతని మెడచుట్టూ రెండు చేతులూ వేసి చెవి దగ్గిరగా నోరుపెట్టి ఆనందంగా ఈల వేసింది. పాపారావు అదిరిపోయాడు. దయ్యమేమోఅని క్షణం బెంగపడ్డాడు. ధైర్యం చేసి అదే అడిగాడు. తాయారు కోపగించుకొని బయటికిపోబోయింది. పాపారావుకి తొలిరాత్రి ఆ విధంగా పాడవటం ఇష్టంలేక, సత్యనారాయణ రాజు చెప్పిన చివరిదీ-ఆఖరుదీ అయిన సలహా జ్ఞాపకం వచ్చి తాయారుని లాలించాడు.

శోభనం గదిబయట పేరంటాళ్ళకి మాత్రం గదిలోంచి ఈలపాటలు వినిపించాయి. "పెళ్ళికొడుకు చాలా హుషారుగావున్నాడు" అనుకున్నారు- తాయారు సంగతి తెలియని పేరంటాళ్ళు మాత్రం.

ఇలా మొదలయింది పాపారావు ఈల బాధ.

పొగడ చెట్టు క్రింద విరాగిలా కూర్చునివున్న పాపారావు, క్రిందటి ఆటలో ఆల్‌కౌంటు ఇచ్చి, ఈ ఆటలో రాంగ్ షో చూపించి దొరికిపోయిన వాడిలా దిగులుగా వున్నాడు. మొన్న సినిమాలో జరిగిన సంఘటనజ్ఞాపకం వచ్చి అతడికి ఉబికి ఉబికి దుఃఖం రాబోతోంది. అసలేం జరిగిందంటే—

ఉద్యోగం రాన్నికితం పాపారావు ఎప్పుడూ సినిమాకి బెంచీకే వెళ్ళే వాడు. పెళ్ళయ్యేక భార్యను తీసుకొని సినిమాకి వెళ్ళడం అదే ప్రథమం. "కల్పనా"లో ఒక తెలుగు సినిమా ఆడుతూంది. ఆ సినిమా కాకినాడ ఏ పదోసారో రావడం. తాయారుకు స్వంటు తెలుగు సినిమాలంటే మహాఇష్టం. పాత సినిమా అయినా దానికే వెళదామంది. పాపం, పాపారావు కేమి తెలుసు? ఎప్పుడూ శ్రీరామ పట్టాభిషేకం లాంటివి చూస్తుంటాడు. "సరే" అంటూ సినిమాకి బయలుదేరదీశాడు భార్యని.

రిషా దిగి అలవాటు ప్రకారం ఎనభై పైసల టిక్కెట్టువైపు దారితీయ బోయి ప్రక్కనే భార్య వుందని గ్రహించి, కుర్చీ టిక్కెట్టు తీసుకుంటే భార్య దృష్టిలో చులకన అయిపోతానని అభిమానపడి, రెండు రిజర్వ్‌డు టిక్కెట్లు తీసుకున్నాడు సత్యనారాయణరాజు సలహా ప్రకారం.

తాయారు, పాపారావు కంటే నాలుగంగుళాలు పొడవు. ఇద్దరూ హాల్లోకి ప్రవేశించగానే అందరికళ్ళూ వాళ్ళమీదే నిలిచాయి. రిజర్వ్‌డు క్లాసులో అమ్మాయిలూ, అబ్బాయిలూ చాలామంది వున్నారు. పాత స్టంటు సినిమాలంటే ఈ మధ్య అబ్బాయిలూ, అమ్మాయిలూ ఎందుకో తెగ ఇష్ట పడుతున్నారు. అబ్బాయిల అల్లరి మామూలేగా.

పాపారావుకి క్లాసులో ఎక్కడా రెండు సీట్లు పక్కపక్కగా కని పించలేదు. తాయారు అమ్మాయిలమధ్య ఓ సీటు ఖాళీగా దొరికితేఅందులో వెళ్ళి కూర్చుంది. ఆ వెనక వరసలో తాయారు సీటు వెనక కుర్చీలో పాపా రావు కూలబడ్డాడు.

సినిమా మొదలయింది. ఒకచోట హీరో, కొండదొంగ ఒకడూ తీవ్రంగా దెబ్బలాడుకుంటున్నారు- అబ్బాయిలలోంచి (రిజర్వ్‌డు క్లాసు ల్లోంచి) ఎవరో గట్టిగా ఈల వేశారు. వెంటనే ఆ ఈలకి మంచి "రెస్పాన్స్" వచ్చింది. హాలంతా విజిల్స్‌తో నిండిపోయింది.

అమ్మాయిలిదంతా చూస్తున్నారు. అందులో ఒక అమ్మాయి వుండ బట్టలేక అనేసింది. "మనం మగవాళ్ళతో ఇంచు మించుగా సమానమేకాని, ఈల మాత్రం వేయలేకపోతున్నాం" అని. అంతా చాలా సీరియస్‌గా బాధ పడ్డారు. అంతలో హాలంతా నిశ్శబ్దం అయిపోయింది, కొండచివర హీరో, విలన్‌లు పోరాడుతున్నారు. విలన్ క్రిందపడిపోయాడు. అంతే, నోట్లో వేలుపెట్టి నాలుక మడతవేసి హాలు దద్దరిల్లేలా ఈల కొట్టింది తాయారు.

చాలా సీరియస్‌గా సినిమా చూస్తున్న పాపారావు పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపోయాడు. అమ్మాయిలంతా తాయారు వైపు, తమలో

తామూ చూసుకున్నారు. అమాంతం సినిమా ఆగిపోయింది. లైట్లు వెలిగాయి. తాయారు విజయగర్వంతో అమ్మాయిలవైపు చూసింది.

పాపారావు అథఃపాతాళం ఎక్కడన్నా కనబడుతుందేమోనని వెతుక్కుంటూ ఉన్నాడు. అమ్మాయిలంతా చప్పట్లు కొట్టి తాయారుకి 'కంగ్రాట్స్' చెప్పారు.

"మీ ఇల్లెక్కడండి?" ఒక అమ్మాయి అడిగింది.

"రామారావుపేట— ఈశ్వరా లైబ్రరీ దగ్గర" అని చెబుతోంది తాయారు. పాపారావు తాయారు చెప్పేవన్నీ వింటున్నాడు. వాళ్ళంతా ఈల నేర్చుకోవడానికి ఇంటికి వస్తారట. అలాగే రమ్మంటూంది తాయారు. "బొరా!" అని ముక్కుమీద వేలువేసుకున్నాడు పాపారావు. అంతలో రీలు తెగిపోయిన సినిమా మళ్ళీ మొదలయింది.

మళ్ళీ యుద్ధం సీను వచ్చేసరికి తయారు ఈల వెంబడి ఈల వేయటం మొదలుపెట్టింది. దానికి అమ్మాయిలంతా సపోర్టు.

హాల్లో పొగత్రాగినవారిని శిక్షించే నిమిత్తం వారిని హాలు బయటకు తీసుకుపోయి వారి దగ్గర కొద్దోగొప్పో స్వీకరించి వదిలేసే పోలీసులిద్దరికీ, అబ్బాయి ఎవరైనా అమ్మాయిల మధ్యలో కూర్చుని ఈలకొడుతూ పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నాడేమోనని అనుమానం వచ్చింది. తాయారు దగ్గరకి వచ్చి పరిశీలనగా చూడసాగారు.

పాపారావు ఇంక సహించలేకపోయాడు. వెంటనే చివాల్న కుర్చీలోంచి లేచి, తాయారూ, తల నొప్పిగా వుంది నేను వెళుతున్నాను" అంటూ బయలుదేరాడు. తయారు తన కుర్చీలోంచి లేచి, పతి ననుసరించింది. విషయం అర్థమయిన పోలీసు లిద్దరూ అక్కడే బీడీలు వెలిగించి, దమ్ములాగి సర్దుకున్నారు.

పాపారావు తాయారుతోసహా రిక్షా ఎక్కి ఇంటికి చేరాడు. తాయారు లోపలికి రాగానే, "తాయారూ, నువ్వలా ఈల వేయచ్చా?" అంటూ సన్నగా చివాట్లువేశాడు. "మీ మగవాళ్ళు వేయవచ్చా!" అంటూ మళ్ళీ

వేయబోయింది. "నాకు కోపం తెప్పించకు" అన్నాడు భయపడుతూనే. ఎందుకంటే, తాయారు బరువూ, ఎత్తూ పాపారావుకంటే ఎక్కువే.

* * * *

పాపారావు బాధపడుతూ సిమ్మెంటు బెంచీమీదనించి లేచి బయటకి వచ్చాడు పార్కులోంచి. చతుర్ముఖ పారాయణంవైపు దారితీయబోయి, అది నెలాఖరు ఆదివారమనీ, అందువల్ల జేబులో డబ్బులు లేవనీ గుర్తు కొచ్చి ఇంటికి బయలుదేరాడు.

పాపారావు భోజనంచేసి పడకగదిలో తీరికగా కూర్చుని ఉండగా ఇంటిముందు రెండు రిక్షాలు ఆగి, నాలుగు సీతాకోక చిలుకలు దిగినాయి. పాపారావు కిటికీలోంచి చూస్తూండగానే తాయారుగారి ఇల్లు యిదేనా అని వాళ్ళు అడగడం, తాయారు లోపలనుంచి వచ్చి ఎవరు కావాలండీ అని అడగడం జరిగినాయి. పాపారావు ఆశ్చర్యపడుతూ ఉండగానే వాళ్ళలో ఒక అమ్మాయి "మీరే కావాలండీ, ఆ రోజు సినిమాహాల్లో సంగతి మరిచి పోయినట్టున్నారు" అని అంది.

తాయారు హుషారుగా ఒక్క సారి ఈలవేసి- "రండి రండి మరిచి పోయాను సుమండీ" అంటూ ఆహ్వానించింది.

పాపారావు కుక్కిన పేనులా మంచంమీద పడుకొని నెలకిసరిపడా తెచ్చిన ద్రాక్ష, జీడిపప్పు మళ్ళా తెచ్చుకోవలసిన అవసరం గురించి ఆలో చించసాగాడు.

హాల్లో అమ్మాయిలు గుసగుసగా మాట్లాడుకుంటున్నారు. పాపా రావుకి వాళ్ళ మాటలు అస్పష్టంగా విన్పిస్తున్నాయి.

"ఇవన్నీ ఎందుకండీ?"

"మరేం ఫర్వాలేదు. నేను మీ ఇంటి కెప్పుడయినా వస్తే ఏమీ పెట్టనవసరంలేదులెండి" అని పెట్టి, "సమయానికి మావారు ఇంట్లో లేరు.

ఉంటే ఎంతో సంతోషిద్దుకు" అని పడకగది దగ్గరకువెళ్ళి బయట గొళ్లెం పెట్టేసింది.

పాపారావు పక్కమీదనుంచి ఎగిరికూర్చున్నాడు. "బయటికెక్కడా పోనివ్వకుండా ఏమిటి బందిఖానా" అని తాయారుమీద బోలెడు కోప్పడి పోయి, దాంతో, ఏమీ లాభం లేదని తెలిసినవాడై, ఒకవేళ తలుపు తీయ మన్నా అందరిముందూ ఏమైనా అంటుందేమోనన్న భయంచేత మంచం మీదే పడుకొని బయటవాళ్ళ మాటలు వినసాగాడు.

"మీరేం చదువుతున్నారండీ?" అని అమ్మాయిల నడిగింది తాయారు.

"ఈవిడ నర్మద, ఇది రాజేశ్వరి, ఈ అమ్మాయి పేరు అనూరాధ. ఇక నా పేరు పద్మ" అంటూ ఓ అమ్మాయి పరిచయ కార్యక్రమాన్ని ముగించింది. "మేమంతా ఉమెన్స్ కాలేజీలో బి. యస్. సి. ఫైనలియర్ చదువుతున్నాం."

"నా పేరు తాయారు. అదిగో ఆ ఫోటోయే మావారు. పేరు నే చెప్పకూడదులెండి. ఆయన స్టేట్ బ్యాంక్‌లో కాషియరు"

పాపారావు గదిలో మండిపోతున్నాడు, తాయారు నక్కవినయాలు వినలేక.

"అవునూ. ఆరోజు సినిమా మధ్యలో అలా ఎందుకు వెళ్ళి పోయారు?" అంది ఒక నీరజాక్షి.

"మా వారికి మధ్యలో భరించలేనంత తలనొప్పి వచ్చిందండీ. ఇంటికొచ్చిన తరువాత ఆ రాత్రంతా దగ్గర కూర్చొని, అమృతాంజనం రాసీ, పట్టువేసీ, అదిచేసీ, ఇదిచేసీ, నానా అవస్థలుపడితే, చివరికి ఎలాగయి తేనేం ఏ అర్థరాత్రో నిద్రపోయారు" అంది తాయారు.

"మీ వా రెప్పుడు వస్తారండీ?" అని అంటూంది ఓ అమ్మలమిన్న.

"ఎందుకూ?" అని వెళ్ళి అడుగుదామనుకున్నాడు పాపారావు. బాగోదని ఊరుకున్నాడు.

"సాయంత్రందాకా రారండి- పూరెళ్ళారు" అంది తాయారు.

ఒక క్షణం నిశ్శబ్దం.

"మీరంత గట్టిగా ఎలా ఈలవేస్తారండీ? అసలు మీరిలా ఈల వేయడం మీ వారికి ఇష్టమేనా?" అని పత్రికా విలేఖరుల్లాగ ప్రశ్నలుగుప్పించారు. తాయారు అన్నిటికీ ఓపిగ్గా సమాధానాలు ఇస్తూంది. "మావారు, నేనూ కలిసి మెలసి ఉంటామండి. ఎప్పుడూ నన్ను ఈలవేయమని ఆయనే ప్రోత్సహిస్తూంటారు. తన జీవనరాగానికి నా ఈలే పల్లవి అని కవిత్వం చెబుతూ వుంటారుకూడా."

ఒళ్ళు మండిపోతూంది పాపారావుకి. మంచంమీదనుంచి దిగి అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

"సరే ఇక పాఠం మొదలు పెడదామా" అని ఒక అమ్మాయి అనేసరికి అంతా ఘొల్లున నవ్వారు.

నవ్వులు తగ్గిన తరువాత "ఇదిగో ఈల అంటే ఇలా వేయాలి" అని నోట్లో వేలుపెట్టి, నాలుక మడతవేసి విజిల్ వేసింది. అంతా చప్పట్లు చరిచారు.

ఆ తరువాత ఒకరి తరువాత ఒకరు ప్రయత్నించారు. కానీ, ఎవరూ వేయలేకపోయారు.

"మీరు ప్రయత్నించి చూడండి. నేను పొయ్యిమీద ఎసరు పడేసి వస్తాను" అంటూ తాయారు ఇంట్లోకి వెళ్ళింది.

హాలంతా ప్రాక్టీసు మొదలయింది. ఇలాగే ఇంకెంత మందిని ఈల కత్తెలుగా తయారుచేసి వాళ్ళ మొగుళ్ళని బాధ పెట్టమంటుందో.... అని అనుకుంటూ తల పట్టుకున్నాడు పాపారావు.

బయట ఇష్టారాజ్యంగా ఈల ప్రాక్టీసు సాగుతోంది. అంతలో ఒక అమ్మాయి తన ప్రయత్నంలో సఫలీకృతురాలై గట్టిగా ఈలవేసింది. ఈల వెంట ఈల. అందరికీ వచ్చేసినట్టే. గదిఅంతా విజిల్స్‌తో నిండిపోయింది.

పాపారావుకి భూమి గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది. గోడ మీదున్న కాలెండరులో ఆంజనేయులు నవ్వుతున్నట్లు అనిపించింది. పిడి కిళ్ళు ఆవేశంతో మూసుకున్నాయి.

హాలులో గోల ఎక్కువైంది. ఆ ఇంట్లో ఏమయినా గొడవ అవు తోందేమోనని పక్కింటివాళ్ళు ఒకరిద్దరు తొంగిచూసి వెళ్ళిపోయారు.

పాపారావు వున్న గది కిటికీ వీధివేపున వుంది. హాల్లో తొంగి చూసి వెళ్ళిపోతూ వాళ్ళలో వాళ్ళు అనుకున్న మాటలు పాపారావు చెవిలో పడ్డాయి. "మొగుడు ఆడారి వాడయితే పెళ్ళాలు మొగుళ్ళవుతారు. ఈ అమ్మాయిని ఈ ఇంట్లోకొచ్చిన దగ్గర్నుంచి చూస్తున్నాను- మొగుడంటే ఇంత పిసరు లెక్కలేదు సరికదా, పైగా మొగుడే ఈ అమ్మాయికి భయ పడతాడు"

ఈ మాటలు తాయారు వేసిన ఈలకంటే ఎక్కువ బాధపెట్టినాయి. కాలెండరువైపు చూశాడు. ఆంజనేయులు దీవిస్తున్నట్టు కనబడ్డాడు. ఏదో కొత్తబలం వచ్చినట్టు హుంకరించాడు.

"నేను వన్, టూ, త్రీ అనగానే అంతా ఒకసారి ఈల వెయ్యండి చూద్దాం" అని ఆఖరి పాఠం చెబుతోంది తాయారు.

"సరే, సరే" అన్నారందరూ.

"వన్....టూ...."

"తాయారూ? తలుపు తియ్యి...." అని ఒక్కసారి గర్జించాడు పాపారావు.

అంతా ఉలిక్కిపడ్డారు. ఒక్కక్షణం హాలంతా నిశ్శబ్దమయిపోయింది. అమ్మాయిలకి ఏమీ అర్థంకాలేదు. పడకగదివైపు, తాయారువైపు చూశారు. తాయారు అంతలో సర్దుకొని...."కూర్చుందురూ, హాల్లో ఆడవాళ్ళున్నారు" అంది.

"తలుపు తీస్తావా, తన్నమన్నావా!" బెడ్‌రూమ్‌లో నుంచి కేక వినిపించింది.

"ఎంత ధైర్యం? రండి, ఎలా తంతారో చూస్తాను" అని నడుం బిగించింది తాయారు.

అమ్మాయిలంతా విస్తుపోయి, ఈల సంగతెలా వున్నా ఇక్కడేదో ఘోరావమానం జరుగుతుందేమోనని భయపడటం మొదలు పెట్టారు. "మీకేం భయంలేదు" అని వాళ్ళకో అభయహస్తం చూపించి వెళ్ళి గొళ్ళెం తీసింది.

పాపారావు ఆవేశంతో రొప్పుతూ హాల్లోకి వచ్చి పడ్డాడు. అమ్మాయిలవైపు తిరిగి...."మీకు సిగ్గూ-ఎగ్గూలేదా? ఈల నేర్చుకొంటే ఫలితం ఏమిటో ఇప్పుడు చూద్దురుగానీ" అన్నాడు.

"ఏమిటండీ చూసేది? పరాయి వాళ్ళముందు ఎప్పుడూ లేంది— ఇలా అవమానిస్తారా?" అంటూ ఆడపులిలా పాపారావు మీదకు దూకబోయింది తాయారు.

పాపారావు వంటింట్లోకి పరిగెట్టాడు. హాల్లో అమ్మాయిలకి ఇదంతా సినిమాలా వుంది. అంతలో పాపారావు బయట కొచ్చాడు. ఈసారి చేతిలో కత్తిపీట వుంది.

పాపారావు అవతారం చూసి తాయారే భయపడింది. పాపారావు విజృంభించాడు. ఇకముందేం జరుగుతుందోనన్న ఆలోచన లేకుండా, ఏదో సినిమాలో రాకుమారుడు మంత్రగత్తె జుట్టు కోసేసినట్టు తాయారు మెడ వంచి జుట్టు కోసేశాడు.

నలుగు రమ్మాయిలూ అది చూసి పరిగెత్తి వెళ్ళిపోయారు బయటికి.

తాయారు ఏమి జరిగిందో తెలుసుకునే లోపున చేతిలో కొచ్చిన జడను విసిరేసి, "నువ్వేసిన వేషాలకి అసలు చంపేద్దును. వట్టి మనిషివి కావని ఇంతటితో వదిలాను ఇప్పుడు పోవే. పుట్టింటికి పోతావో, ఉప్పు

చేస్తో చూకుతావో" అంటూ వీధి తలుపు గడియవేసి మళ్ళీ తాయారు దగ్గర కొచ్చాడు.

మోకాళ్ళమీద తల పెట్టుకుని తాయారు ఏడుస్తూంది. పాపారావుకి జాలివేసింది. "తాయారూ! ఎందుకు చెప్పు, నన్ను బాధ పెట్టడం....నువ్వు బాధపడటం" అన్నాడు బాధపడుతూ.

తాయారు తల ఎత్తి.... "క్షమించండి. ఇంకెప్పుడూ ఈల వేయనుగా" అంది.

కత్తిపీట వదిలేశాడు పాపారావు.

"ధన్" మని చప్పుడయింది. మెలకువ వచ్చింది పాపారావుకి. వంటింట్లో డబ్బా ఏదో క్రిందపడినట్టుంది. పక్కకి తిరిగి చూశాడు. తాయారు లేదు. తెల్లవారిపోయిందన్న మాట అనుకున్నాడు.

అంతలో తాయారు స్నానాల గదిలోంచి బయటికొచ్చి పక్క గదిలోకి వెళ్ళిపోయింది. తలారా స్నానం చేసిందేమో, అందంగా జుట్టు భుజాల మీదనుంచి క్రిందికి జారుతోంది. పాపారావు తలగడలో తలదాచుకొని గుండెలనిండా గాలి పీల్చుకొన్నాడు.

పక్క రూములోంచి సన్నగా ఈల వినిపించడం మొదలెట్టింది- సుప్రభాతం ట్యూన్‌లా.

—★—